సాక్షి చిత్తూరు

శుక్రవారం। 15। సెప్టెంబర్। 2023



అర్హతే ప్రామాణికంగా పథకాలు

అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. - IIలో



ఇంటింటికీ ఆరోగ్య రక్ష

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టింది. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	25
తిరుపతి	36	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	36	26

న్యూస్‌రీల్

కాణిపాకం హుండీ ఆదాయం రూ.88లక్షలు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.88 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయం ఆస్థాన మండపంలో 13 రోజుల హుండీ కానుకలను గురువారం లెక్కించారు. బంగారం 5 గ్రాములు, వెండి 450 గ్రాములు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.7 వేలు, విదేశీ కరెన్సీ యూఎస్‌ఏ 1,131 డాలర్లు, సింగపూర్ 50 డాలర్లు, యూఏఈ 65 దీరమ్స్, కెనడా 40 డాలర్లు, యూరో 55 యూరోస్, ఇంగ్లాండ్ 5 పౌండ్లలతో కలిపి రూ.88 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. దేవదాయ శాఖ చిత్తూరు ఏసీ ఏకాంబరం, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరి మాధవరెడ్డి, పర్యవేక్షకులు రవి, రంగస్వామి, కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఆలయ సిబ్బంది, యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ఆగని గజ దాడులు



ధ్వంసమైన టమాట పంట చూపుతున్న రైతు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేట, పాళెం పంచాయతీల్లో రెండో రోజు బుధవారం రాత్రి కూడా పంట పొలాలపై ఏనుగులు దాడి చేసి విధ్వంసం సృష్టించాయి. మద్రికుంట వారిపల్లెకు చెందిన కృష్ణయ్య టమాటా పంట, మరికొందరి రైతులకు చెందిన వరి పంటపై విరుచుకుపడి తొక్కి నాశనం చేశాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ధ్వంసమైన పంటలను చూసి లబోదిబోమన్నారు. అధికారులు స్పందించి ఏనుగులు పంట పొలాలపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేడు పూలే భవనం ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమీపంలో నిర్మించిన మహాత్మా జ్యోతీరావు పూలే భవనాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్న ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారని పేర్కొన్నారు.



శ్రీనివాస సేతు ఫ్లైఓవర్

ఆధ్యాత్మిక నగరానికి.. అభివృద్ధి శోభ

నాడు: శ్రీవారి దర్శనం కోసం ప్రతి రోజూ లక్షలాది మంది భక్తులు తిరుపతికి చేరుకున్నా అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పేరుకు ఆధ్యాత్మిక నగరం అయినా అభివృద్ధికి నోచుకోని పరిస్థితి. ఇరుకు సందులు.. గుంతలమయమైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం. స్థానికులు, పర్యాటకులు, భక్తులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు పచ్చదనం కరువై వెలవెలబోయేవి. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పేరుకు అంతర్జాతీయ విమానాశ్రయం అయినా.. అభివృద్ధికి నోచుకోలేదు. తిరుపతిలో కాలుమోపిన వారికి ట్రాఫిక్, మంచినీటి సమస్యలు అడుగడుగునా పలకరించేవి. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లి రావాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది.

నేడు: నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో ఆధ్యాత్మిక నగరం అభివృద్ధి శోభను సంతరించుకుంటోంది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు తిరుమల తిరుపతి దేవస్థానం స్థానికులు, భక్తులకు అన్ని సౌకర్యాలను సమకూరుస్తున్నాయి. నాటి సందులు నేడు రహదారులుగా మారాయి. మాస్టర్ ప్లాన్‌తో రోడ్ల అభివృద్ధి శరవేగంగా సాగుతోంది. నగర శివారు కాలనీలు అత్యాధునిక ప్రాంతాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. యూడీఎస్, మురుగు కాలువలు, తాగునీరు, పైప్‌లైన్లు నూతనంగా నిర్మిస్తున్నారు. రోడ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌తో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. గడచిన మూడేళ్లలో 125.19 కి.మీ మేర సీసీ రోడ్లు, 32.02 కి.మీ. బీటీ రోడ్లను అభివృద్ధి చేశారు. మూడో విడతలో రూ.132 కోట్లతో 150 కి.మీ సీసీ రోడ్లు నిర్మించారు. మరో రూ.30 కోట్లతో 65కి.మీ మేర బీటీ రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

– సాక్షి, ఏపీ నెట్‌వర్క్

- భక్తులకు వసతులు, రక్షణే లక్ష్యం
- రూ.650 కోట్లతో శ్రీనివాస సేతు నిర్మాణం
- మరో రూ.135 కోట్లతో మాస్టర్ ప్లాన్, సీసీ రోడ్లు
- ఆహ్లాదం కోసం ఆధునిక పార్కులు.. మౌలిక వసతులు
- తిరునగరికి తలమానికంగా వినాయక సాగర్ పార్కు
- 18న శ్రీనివాస సేతును ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

రూ.650 కోట్లతో శ్రీనివాస సేతు నిర్మాణం

శ్రీవారి భక్తులు, పర్యాటకుల రాకపోకలకు వీలుగా రూ.650 కోట్లతో శ్రీనివాస సేతు నిర్మాణం పూర్తి చేశారు. తిరుచానూరు మార్గంలోని మామిడికాయల మండీ నుంచి అలిపిరి పోలీస్ స్టేషన్ వరకు, కరకంబాడి మార్గంలో మద్దిమానులు ఉన్న ప్రాంతం వరకు ఈ వంతెన నిర్మాణం పూర్తయింది.



సుందరంగా పద్మావతి పార్క్

ఆహ్లాదం.. ఆనందం

పార్కులను ఆధునికంగా తీర్చిదిద్దారు. ఆక్సిజన్ ఉత్పత్తి చేసే మొక్కలతో పాటు వాకర్స్‌కు ట్రాక్, స్కేటింగ్ గ్రౌండ్, ఓపెన్ ఆడిటోరియం, వాటర్ ఫౌంటైన్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలను కల్పించారు. ప్రకాశం పార్క్ ఆధునీకరణకు రూ.1.20 కోట్లు, బైరాగిపట్టెడ పద్మావతీ పార్క్‌కు రూ.42.50 లక్షలు, వినాయకసాగర్ మొదటి దశను రూ.20 కోట్లతో అభివృద్ధి చేశారు.



వినాయక సాగర్‌లో ఐల్యాండ్

తిరుపతి ట్యాంక్ బండ్‌గా వినాయక సాగర్

మురికి కూపంగా ఉన్న వినాయకసాగర్‌ను రూ.42 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. సాగర్‌లోకి శుద్ధిచేసిన నీటిని విడుదల చేసేందుకు ఇటీవల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐలాండ్‌తో పాటు బోటింగ్ పాయింట్, కిడ్స్ పార్క్, సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఫుడ్ కోర్టు, వినాయక ప్రతిమల నిమజ్జనానికి ప్రత్యేక బ్లాక్, పార్కింగ్, ఓపెన్ ఆడిటోరియం వంటి సౌకర్యాలను అభివృద్ధి చేశారు.



పంగలూరు సీతమ్మ మార్గం

సుందర రహదారులు

ఈ ఏడాది శెట్టిపల్లి పంచాయతీని విలీనం చేయడంతో తిరుపతి నగర విస్తీర్ణం 30.1 చ.కి.మీ చేరింది. విస్తీర్ణం పెరిగినా అభివృద్ధి పాత నగరానికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నగర విస్తరణకు కంకణం కట్టుకున్నారు. ముందుగా వైఎస్సార్ మార్గ్ (డీబీఆర్ రోడ్డు), రేణిగుంట–కరకంబాడి రోడ్డును కలుపుతూ అన్నమయ్య మార్గ్ నిర్మించారు. మరో 15 మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టారు.

తిరుపతి వివరాలు

విస్తీర్ణం	30.01 చ.కి.మీ
గృహాలు	92 వేలు
జనాభా	4.01 లక్షలు
డివిజన్లు	50
రోజూ తిరుపతికి వచ్చి వెళ్లే వారి సంఖ్య	1.5 లక్షల మంది

తిరుపతిలో పూర్తయిన రోడ్లు

సంవత్సరం	సీసీ రోడ్లు(కి.మీ)	వ్యయం రూ.కోట్లలో
2021-22	25.86	రూ.23.13
2022-23	53.77	రూ.48.10
2023-24	45.56	రూ.40.76
మొత్తం	125.19	రూ.111.99

సంవత్సరం	బీటీ రోడ్లు(కి.మీ)	వ్యయం రూ.కోట్లలో
2022-23	4.32	రూ. 2.50
2023-24	27.70	రూ. 16.06
మొత్తం	32.02	రూ.18.56

కొత్తగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ

సంవత్సరం	యూడీసీ కొత్త లైన్	ఖర్చు రూ.కోట్లలో
2021-22	25.86 కి.మీ.	రూ. 23.13
2022-23	53.77 కి.మీ	రూ. 48.10
2023-24	45.56 కి.మీ	రూ. 40.76
మొత్తం	125.19 కి.మీ	రూ.111.99

తిరుపతి దశను మార్చే రహదారులు

మాస్టర్ ప్లాన్ రహదారులు	17
అందుబాటులోకి వచ్చినవి	8
ఖర్చు చేస్తున్న మొత్తం	రూ.52.91 కోట్లు
రహదారుల విస్తీర్ణం (మీటర్లలో)	18,344 (18.34కి.మీ)
టీటీడీ అభివృద్ధి చేస్తున్న రోడ్లు	3
వ్యయం	రూ.18 కోట్లు
వంద అడుగుల రోడ్డు	1
80 అడుగుల రోడ్లు	8
60 అడుగుల రోడ్లు	5
40 అడుగుల రోడ్లు	3

అత్యాధునిక కచ్చపి ఆడిటోరియం

ఎన్టీఆర్ హయాంలో మహతి ఆడిటోరియం నిర్మించారు. ఒక్కటే ఆడిటోరియం ఉండడంతో అందరికీ అవకాశం లభించేది కాదు. దీంతో తిరుపతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మైదానంలో రూ.40 కోట్లతో 'కచ్చపి' ఆడిటోరియాన్ని నిర్మించారు.

నడక దారి భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



అలిపిరి నుంచి తిరుమలకు నడిచివెళ్లే మెట్ల మార్గాన్ని ఆధునికీకరించారు. చిన్నారిపై చిరుత దాడి నేపథ్యంలో అలిపిరి మార్గంలో నడిచి వెళ్లే భక్తుల తక్షణ రక్షణ కోసం టీటీడీ చేతికర్రలు అందిస్తోంది. అదేవిధంగా సెక్యూరిటీ సిబ్బందిని నియమించింది. క్రూర మృగాలను బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేసింది. వాటి జాడ తెలుసుకునేందుకు ట్రాప్ కెమెరాలు అమర్చింది. ఇప్పటికే ఐదు చిరుతలను పట్టుకుని జూలో విడిచిపెట్టింది.

యూడీసీకి చికిత్స



తిరుపతి నగరంలో 40 ఏళ్లనాటి యూడీసీతోనే రెండేళ్ల వరకు నెట్టుకొచ్చారు. తిరుపతిలో నివాసాలు పెరగడంతో నాటి యూడీసీ సామర్థ్యం సరిపోలేదు. దీంతో ఎక్కడికక్కడ మ్యాన్ హోల్స్ ఓవర్ ఫ్లో అయ్యి ఇబ్బందికరంగా మారింది. 2020లో కొత్త యూడీసీ వ్యవస్థ అవసరాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గ్రీన్ సిగ్నల్ రావడంతో 2021 నుంచి దశలవారీగా యూడీసీ పనులు ప్రారంభమయ్యాయి. శిథిలావస్థకు చేరిన యూడీసీకి చికిత్స చేస్తున్నారు.

తిరుపతిలో డబుల్ డెక్కర్ బస్సు



పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విద్యుత్ బస్సులను తీసుకొచ్చింది. అలిపిరి డిపో కేంద్రంగా విద్యుత్ బస్సులు నడుపుతున్నారు. ప్రస్తుతం తిరుమలకు 50, విమానాశ్రయానికి 14 ఇలా మొత్తం 100 విద్యుత్ బస్సులు నడుస్తున్నాయి. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నగరపాలక సంస్థ నిధులతో ఇండియన్ మేడ్ ఫుల్ డబుల్ డెక్కర్ బస్సును కొనుగోలు చేశారు. 60 సీట్ల కెపాసిటీ ఉన్న ఈ బస్సు గురువారం నుంచి తిరుపతి టౌన్ సర్వీసు పేరుతో నడుపుతున్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో తిరుపతి అభివృద్ధి



టీడీపీ పాలనలో నిరాదరణకు గురైన తిరుపతి నగరాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తున్నాం. శ్రీనివాస సేతు వంతెన, మాస్టర్ ప్లాన్ రహదారులు, అంతర్గత రోడ్లు వేశాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నాం. పార్కులను అభివృద్ధి చేశాం. 22ఏలో ఉన్న స్థలాలపై స్థానికులకు పూర్తి హక్కు కల్పించాం. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. – భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే

తిరుపతిని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం



ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని గత పాలకులు పూర్తిగా విస్మరించారు. తిరుపతిని అభివృద్ధి చేయాలనే ఆలోచన మరిచారు. సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి సహకారం, టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో తిరుపతిని దేశంలోనే నంబర్–1 నగరంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రజల సహకారంతో మాస్టర్ ప్లాన్ రోడ్లు వేస్తున్నాం. ఇప్పటికే 18 రోడ్లు పూర్తి కావచ్చాయి. మరో 14 రోడ్లను కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. – భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

బృందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
డోర్ నెం.6-566/2ఎ, నాగాలమ్మ గుడి ప్రక్కన
సంతపేట, చిత్తూరు
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97037 74402

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: జిల్లాలో శుక్రవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి తెలిపారు. గురువారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో కార్యక్రమం అమలుపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వైద్య బృందం, వలంటీర్లు సమన్వయంతో ఈ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. అనారోగ్య సమస్యలను గుర్తించి పక్కాగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 30వ తేదీ నుంచి మెగా వైద్య శిబిరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి వైద్య శిబిరంలో నలుగురు స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారని తెలిపారు. అక్కడ మందులు, మాత్రలు అందుబాటులో ఉంచి ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురిని భాగస్వాములను చేసి మెగా శిబిరాలను భారీస్థాయిలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆశయం మేరకు ప్రణాళికలు తయారు చేసుకుని కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేస్తామన్నారు. డీఐఓ రవి రాజు, డీపీఎంఓ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం..



మాట్లాడుతున్న సీనియర్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ అన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం 'పర్యావరణ, కాలుష్య నియంత్రణ తగ్గించడం' అనే అంశంపై స్వచ్ఛంద సంస్థలు, వివిధ పరిశ్రమలు, ఆస్పత్రుల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, పర్యావరణ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రకృతిని సహజంగా ఉంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం, పరిశ్రమల వ్యర్థాలు, ఇతరత్రా కాలుష్య కారకాలతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం న్యాయ వ్యవస్థ అనేక చర్యలు తీసుకుంటోందని, గతంలో ఇచ్చిన తీర్పుల కారణంగానే ప్రస్తుతం చర్యలు జరుగుతున్నాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం పర్యావరణాన్ని పరిరక్షించాల్సి ఉందని తెలిపారు. ప్రధానంగా కాలుష్య నియంత్రణ కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను ప్రభుత్వ శాఖలు, ఇతర వ్యవస్థలు తప్పక పాటించాలన్నారు. ప్రమాదకరమైన మెడికల్ బయో వ్యర్థాలను, పారిశ్రామిక వ్యర్థాలను నిర్దేశించిన ప్రమాణాల మేరకు మేరకు రీసైక్లింగ్ చేయాలన్నారు. ఇటీవల కాలంలో చిత్తూరు సుందరీకరణతో ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. నగరాన్ని సుందరంగా మారుస్తున్న కమిషనర్ అరుణను అభినందించారు.

ఎస్క్యాప్ భాగస్వామ్యంతో పనులు

కమిషనర్ అరుణ మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ చేపడుతున్నా అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. కాలుష్య నియంత్రణ కోసం నగరపాలక సంస్థ ఎస్క్యాప్ భాగస్వామ్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి జూనియర్ సైంటిస్ట్ అశోక్ మాట్లాడుతూ చిత్తూరులో నగరపాలక సంస్థ చేపట్టిన చర్యలతో పచ్చదనం పెరిగి గాలి కాలుష్యం కొంత శాతం తగ్గిందన్నారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుపై ప్రతిజ్ఞ చేశారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్వో లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరోగ్య రక్ష

ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం మరో విప్లవాత్మక పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 'జగనన్న ఆరోగ్య రక్ష' కార్యక్రమాన్ని చేపట్టింది. వలంటీర్లు, ఆశాలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడం, ప్రాథమిక పరీక్షలతో సమస్యలను గుర్తించడంతో పాటు వైద్య శిబిరాల్లో స్పెషలిస్టులు, పీహెచ్‌సీ వైద్యాధికారులతో చికిత్స అందించి మందులను అందించనున్నారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేసి చికిత్సలు అందజేస్తారు. ఈ కార్యక్రమాన్ని శనివారం నుంచి పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు ప్రారంభించారు.

- నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం
- జిల్లాలోని 19.5 లక్షల మందికి వైద్య పరీక్షలు
- ఉచితంగా మందులు, అవసరమైతే పెద్దాస్పత్రులకు రెఫర్
- 11వేల మంది సిబ్బందితో ఇంటింటి కార్యక్రమం
- 30 నుంచి స్పెషలిస్టులతో వైద్య శిబిరాలు
- పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాక్షి, చిత్తూరు: ప్రజల ఆరోగ్య సమస్యలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరం కానుంది. జిల్లాలో 19.5 లక్షల మంది ప్రజలకు శుక్రవారం నుంచి ఇంటింటికీ ఉచిత వైద్య సేవలు అందించేందుకు జిల్లా వైద్యశాఖ సర్వం సిద్ధం చేసింది. వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇందులో భాగస్వామ్యం కానున్నారు. 11వేల మంది భాగస్వామ్యంతో జిల్లా వ్యాప్తంగా 612 సచివాలయాల పరిధిలోని హెల్త్ సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లలో శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు. అవసరమైన వారికి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందించనున్నారు. తొలుత వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని కొన్ని రకాల పరీక్షలను అక్కడే నిర్వహిస్తారు. ఆ పరీక్షలకు తాత్కాలిక మందులు ఇస్తారు. దాంతో పాటు ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న క్యాంపులకు సంబంధించి సమాచారం ఇచ్చి టోకెన్లు ఇస్తారు. వారిని క్యాంపునకు వెళ్లేటట్లు చేసి.. అవసరమైన చికిత్సలు నిర్వహిస్తారు. ఈనెల 30 నుంచి 45 రోజుల పాటు క్యాంపుల్లో ఉచిత వైద్య సేవలు అందించనున్నారు. క్యాంపులకు వచ్చే వారికి మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నారు.

యాప్‌లో నమోదు

వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవసరమైన కార్యక్రమాన్ని వివరిస్తారు. యాప్‌ను డౌన్లోడ్ చేయిస్తారు. వారికున్న వ్యాధులు, అవసరమైన చికిత్సను అదే యాప్‌లో అప్లోడ్ చేస్తారు. ఆ యాప్ నుంచి వివరాలు తీసుకున్న ఆరోగ్య సిబ్బంది వారి ఇళ్లకు తిరిగి వెళ్లి ఏడు రకాల పరీక్షలు నిర్వహిస్తారు. తదుపరి వైద్య శిబిరాలకు వెళ్లేలా టోకెన్లు ఇస్తారు. అక్కడ స్పెషలిస్టులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. అవసరమైతే పెద్దస్పత్రులకు రెఫర్ చేస్తారు. జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు.

జిల్లా సమాచారం ఇలా	
వైద్య సేవలు	19.5 లక్షల మందికి
వలంటీర్లు	7,900 మంది
వైద్య సిబ్బంది	2,700 మంది
వైద్యులు	250 మంది
హెల్త్ సెంటర్లు	478
అర్బన్ హెల్త్ సెంటర్లు	492

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

తొలుత ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు, ఆ తర్వాత ఆశాలు తగిన పరీక్షలు నిర్వహించి చిన్నచిన్న వ్యాధులు అయితే మందులు ఇస్తారు. అవసరమైతే టోకెన్ ఇచ్చి క్యాంపులకు పంపిస్తారు. అక్కడ ప్రత్యేక వైద్యుల ద్వారా చికిత్సలు అందిస్తాం. ఇతర ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటే అక్కడికి రెఫర్ చేస్తాం.



- షణ్మోహన్, జిల్లా కలెక్టర్

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

నగరి : తన నివాస కార్యాలయంలో పుత్తూరు మండలం తిరుమల కుప్పం గ్రామానికి చెందిన పి.గురుస్వామినాయుడు ఓపెన్ హార్ట్ సర్జరీకి రూ.6 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా గురువారం అందించారు. ఇటీవల మంత్రిని కలిసిన బాధిత కుటుంబ సభ్యులు గురుస్వామి నాయుడు పరిస్థితిని వివరించారు. ఓపెన్ హార్ట్ సర్జరీకి లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు తెలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆమె సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించి రూ.6 లక్షలు మంజూరయ్యేలా చేశారు. బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


చెక్కు అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

బిల్లుల ఆన్‌లైన్ వసూళ్లు పెంచాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ వసూళ్లను మరింత పెంచాలని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ట్రాన్స్‌కో రూరల్ ఈఈ కార్యాలయంలో ఈఆర్వోల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్బన్, రూరల్ డివిజన్ల పరంగా ప్రతినెలా రూ.30 కోట్ల వరకు బిల్లుల ద్వారా వసూలు అవుతోందన్నారు. అందులో ప్రైవేటు సర్వీసుల పరంగా రూ.22 కోట్లు, ప్రభుత్వ సర్వీసుల పరంగా రూ.8 కోట్లు వస్తోందని తెలిపారు. మొండిబకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం డివిజన్‌లో 60 శాతం వరకు ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. వీటిని మరో 20 శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అర్బన్ ఈఈ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏఈ బ్రహ్మయ్యచ్చారి మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీల గురించి వినియోగదారులకు తెలియజేయాలని తెలిపారు. బిల్లుల పరంగా సమస్యలను సకాలంలో పరిష్కారించాలన్నారు. మీటర్ మరమ్మతులు అయితే చాలెంజింగ్ ఫీజు కట్టించుకుని పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ హరి, పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఏఓ గీత, జేఏఓ గోవిందరాజులు, ఏఈ, సబ్‌ఇంజనీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాసులు

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- తప్పు చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: అర్హతే ప్రామాణికంగా పథకాలను అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన పింఛన్ల పంపిణీ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంతటివారైనా ఆర్థిక నేరాలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. చంద్రబాబు స్కిల్ స్కాం చేసి జైలుకు వెళితే దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ రోడ్లపై పడుకుని యజమాని పట్ల విశ్వాసాన్ని చూపి దిగుజారుడు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ప్రజా ధనాన్ని దోచేసిన చంద్రబాబును సాక్ష్యాధారాలతో అరెస్టు చేస్తే,, ఎవరు అనారోగ్యంతో కన్నుమూసినా చంద్రబాబు కోసం గుండెలు ఆగిపోయాయని ఎల్లోమీడియా, టీడీపీ నాయకులు చేస్తున్న శవ రాజకీయాలను ప్రజలు ఏవగించుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రజలు ప్రాణాలు పోగొట్టుకునేంత గొప్పవాడు కాదన్నారు. బాబు జైలు పాలుకావడంతో బాలకృష్ణ, లోకేష్ మధ్య కుర్చీ పోరు చెలరేగుతుందని, ఎన్టీఆర్‌కు పట్టిన గతే బాలకృష్ణకు తప్పదని హెచ్చరించారు. అనంతరం 201 మందికి నూతన పింఛన్లు పంపిణీ చేశారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,450

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

రెజ్లింగ్ జాతీయ పోటీల్లో కాంస్య పతకం


స్వీటీకుమారిని అభినందిస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు రూరల్: ఢిల్లీలో ఈనెల 9వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ (కుస్తీ పట్టు) పోటీల్లో వడమాలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బి.స్వీటీకుమారి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పతకం సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాలలో స్వీటికుమారిని అధ్యాపక బృందం అభినందించింది.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: యాదమరి మండలం మాధవరంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న గుణశ్యామ్ కుమార్ (23)ను చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు సిబ్బందితో కలిసి యాదమరి మండలంలో తనిఖీలు నిర్వహించారు. మాధవరం వద్ద గుణశ్యామ్‌కుమార్ విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సెల్వకుమారి అనే మహిళ నుంచి కొనుగోలు చేసినట్లు నిందితుడు అంగీకరించడంతో ఆమెపై కూడా కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించారు.

క్వారీలో పేలుడు

శాంతిపురం: కర్లగట్ట పంచాయతీ చీమనపల్లె వద్ద క్వారీలో జరిగిన పేలుడుకు సమీప పొలంలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న మంజునాథ్, రాజేశ్వరి దంపతుల కుమార్తె చిత్ర(11) తీవ్రంగా గాయ పడింది. చిత్ర 5వ తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చి ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఈ ఘటన జరిగింది.

కుస్తీ పోటీలకు జట్ల ఎంపిక


గ్రీకు రోమన్ పోటీలకు ఎంపికైన బాలురు

యాదమరి: అండర్-17 స్కూల్ గేమ్స్ రెజ్లింగ్(కుస్తీ) రాష్ట్ర స్థాయి పోటీలకు యాదమరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బాల,బాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన 80మంది క్రీడాకారులు పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. ఫ్రీస్టైల్, గ్రీకురోమన్ విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, యాదమరి పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ అధ్యక్షతన ఎంపిక పోటీలు జరిగాయి. 15 మంది పీఈటీల పర్యవేక్షణలో మూడు జట్లను ఎంపిక చేశారు.